

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 26.0
తణుకు : 33.0 - 25.0

మరికొన్ని కుటుంబాలకు సాయం

బియ్యం, సరుకులు పంపిణీకి కలెక్టర్ ఆదేశం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఇటీవల వర్షాలు, ముంపు బారిన పడ్డ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటోంది. నిత్యావసర సరుకులు అందించేలా చర్యలు తీసుకున్నది. గతంలో 11 వేల మంది కుటుంబాలకు సరుకులు అందించారు. తాజాగా సర్వేలో మరికొన్ని కుటుంబాలకు సరకులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాలు జారీ చేశారు. భీమవరం, తాడేపల్లిగూడెం రూరల్ మండలం, నర్సాపురం పట్టణంలో బాధితులను గుర్తించారు. మూడు నియోజకవర్గాల్లోనూ తాజాగా 516 మంది బాధితులకు బియ్యంతో పాటు, ఉల్లి, బంగాళదుంపలు, కందిపప్పు, పామాయిల్ అందిస్తారు. ఒక్కో కుటుంబానికి 25 కిలోలు అందిస్తున్నారు. అదికూడా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ బాధితులకు సరుకులు అందించేలా చర్యలు తీసుకుంటోంది. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఉల్లి, బంగాళదుంపలు అందిస్తున్నది.

డ్రోన్‌ల వినియోగంపై

సీఎం అభినందన

కలెక్టర్లతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమావేశం







వెలగపూడిలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న మంత్రి నిమ్మల రామానాయుడు, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల కలెక్టర్లు వెట్రి సెల్వి, నాగరాణి

భీమవరం టౌన్, ఆగస్టు 5 : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం వెలగపూడి సచివాలయంలో కలెక్టర్లు, ఎస్పీల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హాజర య్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన తొలి కలెక్టర్ల సదస్సులో పాలనలో బాధ్యత, జవాబుదారీతనంపై ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేశారు. పాలకొల్లులో తూడు తొలగించేందుకు డ్రోన్‌లను వినియోగించటాన్ని సీఎం చంద్రబాబు అభినందించారు. అదే విధంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విజయ వంతంగా అమలు చేయడంపై సూచనలు చేశారు. 100 రోజుల ప్రణాళిక, పేదల సేవలో కార్యక్రమం, జీరో పావర్టీ, ఈజ్ ఆఫ్ పబ్లిక్ సర్వీసెస్ తదితరాలపై ముఖ్యమంత్రి కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. అదే విధంగా రాష్ట ప్రగతికి సమష్టిగా పనిచేద్దామంటూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సదస్సులో పేర్కొన్నారు.

మాయదారి సర్వే

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రీసర్వేను నిలిపివేసింది. వైసీపీ హయాంలో అమలు చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసింది. గతంలో రీసర్వే చేసినప్పుడు తప్పులు దొర్లడంతో రైతులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భూ సరిహద్దులు మారిపోయాయి. రైతులు మధ్య గొడవలు సర్వసాధారణమైపోయాయి. ఎన్నికల ముందు లక్ష్యాలను నిర్దేశిస్తూ రీసర్వే చేశారు. క్షేత్ర స్థాయిలో సచివాలయ సిబ్బంది, సర్వేయర్‌లు, రెవిన్యూ సిబ్బంది మెడపై కత్తిపెట్టి సర్వే చేయించారు. దాంతో సమస్యలు తలెత్తాయి. ఉమ్మడి భూమి అంతా ఒకరు పేరుమీదే నమోదైపోయింది. అడంగళ్‌లో అదే చూపిస్తోంది. గతంలో పది ఎకరాల భూమి ఉంటే విడి విడిగా సోదరుల మధ్య పంపకం ఉండేది. ఇప్పుడలా కాదు. రీసర్వే ద్వారా ఒకరి పేరు మీదే పది ఎకరాలు నమోదు చేశారు. ఆధారాలు లేవంటూ షాకులు చూపారు. దాంతో ఒకే పేరుతో అడంగల్‌లో నమోదు అయ్యింది. వారసులు బ్యాంకుల్లో రుణాలు పొందాలంటే కష్టమైపోతోంది. జిల్లాలో ఉన్న భూకమతాల్లో దాదాపు 20 శాతం మేర ఇటువంటి ఇబ్బందులు తలెత్తాయి. కనీసం రుణ సౌకర్యం పొందలేకపోతున్నారు. భవిష్యత్తులో భూములు విక్రయించుకోవాలన్న ఇబ్బందికరంగా మారనుంది. రీసర్వేలో తక్కువగా చూపిన భూముల రైతులు పెద్ద మొత్తంలోనే నష్టపోయారు. వాటిని సరిదిద్దుకోవాలంటే రైతులు వ్యయ ప్రయాసలు పడుతున్నారు. ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేయని సర్వే నెంబర్‌లున్నాయి. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నాసరే సిబ్బందికి చేయి తడపాల్సి వస్తోంది. ఒక క్రమ పద్ధతిలో సర్వే చేయలేకపోయారు. కేవలం జగన్‌మోహన్ రెడ్డి ఫొటోలు, బొమ్మలు పెట్టేందుకే సర్వే ఉపయోగపడింది. సరిహద్దు రాళ్లపైనా జగన్ బొమ్మలున్నాయి. పట్టదారు పాస్ పుస్తకాలను సైతం జగన్ బొమ్మలతోనే మంజూరు చేశారు. అంతే తప్పా రైతుల సమస్యలను పట్టించుకోలేదు. సర్వే పూర్తయి కొత్త పాస్ పుస్తకాలు జారీచేస్తే జగన్ ఫొటోలు ఉంటాయన్న తలంపే తప్పా రైతుల ఇబ్బందులపై యంత్రాంగం దృష్టి పెట్టలేదు.

సచివాలయాల్లో అవకాశం

రైతులకు ఏ వైనా ఇబ్బందులుంటే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవడానికి కొత్తగా అవకాశం కల్పించారు. తప్పులు సరిదిద్దుకునే అవకాశం కల్పించారు. సర్వేలో తప్పులపై సచివాలాయల్లో దరఖాస్తు చేసుకుంటే పరిశీలన చేస్తారు. తప్పులను సరిదిద్దనున్నారు. అయితే ఉమ్మడి భూములపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నారు, దీనిపై గత ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేక పోయింది. అదే ఇప్పుడు భూమి వారసులకు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. కూటమి ప్రభుత్వం దృష్టికి సమస్య వెళ్లింది. దాంతో ఉమ్మడి ఆస్తులపై త్వరలో విధాన నిర్ణయం ప్రకటిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. సర్వే శాఖకు ఆ దిశగా ఆదేశాలిచ్చింది. ప్రభుత్వం నిర్ణయం వెలువడిన తర్వాతే సమస్యకు పరిష్కారం లభించనుంది. రైతులు రుణాలు పొందే అవకాశం ఉంటుంది.

తప్పులు దిద్దిన తర్వాతే సర్వే

వైసీపీ హయాంలో నిర్వహించిన రీ సర్వేలో తప్పులను సరిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీచేశారు. ఆ తర్వాతే కొత్తగా సర్వే ప్రారంభించనున్నట్టు స్పష్టం చేశారు. గతంలో తప్పులను సరిదిద్దితే కొత్తగా నిర్వహించాల్సిన సర్వే భూముల్లో తప్పులు ఉండవన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. రీసర్వేను నిలిపివేశారు. తప్పులను సరిదిద్దడానికి ధరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. తప్పులన్నీ సరి అయ్యాక రీసర్వేను మళ్లీ ప్రారంభిస్తారు. అప్పటిదాకా సర్వే నిలచిపోయినట్టే.

బ్యాంకు రుణాలకు నోచుకోని రైతులు

తప్పులు సరిదిద్దాలని ఆదేశం.. అప్పుడే కొత్తగా మళ్లీ సర్వే

రైతులను రీ సర్వే కష్టాలు వెంటాడుతున్నాయి. బ్యాంకుల్లో రుణాలకు నోచుకోలేకపోతున్నారు. సర్వే నంబర్‌లో ఉన్న భూమిని తగ్గించి చూపారు. జిల్లాలో దాదాపు 20శాతం మేర సర్వే నంబర్‌లలో ఇటువంటి దోషాలు తారసపడుతున్నాయి. ఉమ్మడి సర్వే నంబర్‌లో ఒకరి పేరు మీదే భూమి రాసేశారు. దానివల్ల అదే భూమిపై హక్కు ఉన్న దాయాదులు లేదంటే సోదరులు బ్యాంకు రుణాలకు వెళితే ఇవ్వడంలేదు. రుణ పరపతి కూడా కోల్పోయేలా గతంలో రీసర్వే చేపట్టారు. దానికి జగనన్న భూ రక్ష అంటూ పేరు పెట్టారు.





పెంటపాడులోని ఎస్సీ హాస్టల్ దుస్థితి

బీటలు వారి.. పెచ్చులూడి..

- అధ్వానంగా వసతి గృహాలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు

7

వలంటీర్ల గ్రూపుల తొలగింపు

భీమవరం టౌన్, ఆగస్టు 5 : గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థకు సంబందించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా గ్రామ, వార్డు వలంటీర్లు (విధుల్లో ఉన్నవారు, రాజీనామా చేసిన వారు, తొలగింపబడిన వారు)కు సంబంధించి వారి హౌస్ హోల్డ్ పరిధిలో ప్రజలతో ఏర్పాటు చేసుకున్న వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపులన్నింటిని వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థ ద్వారా జిల్లాలో 9,200మంది విధుల్లో ఉన్నారు. గత ఎన్నికల సందర్భంలో దాదాపు 5,246 మంది వలంటీర్లు రాజీనామా చెయ్యగా కొంత మంది ప్రస్తుతం విధుల్లో కొనసాగుతున్నారు. అయితే వారికి ఎటువంటి బాధ్యలు అప్పగించిన దాఖలాలు కనిపించ లేదు. ఈనేపథ్యంలో వలంటీర్లకు సంబంధించిన గ్రూపులను వెంటనే డిలీట్ చెయ్యటంతోపాటు సంబందిత సమాచారాన్ని మధ్యాహ్నం రెండు గంటల్లో అందించాలని కూడా ఆదేశాలు జారీ చేశారు. ఈ సమాచారాన్ని గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా ప్రజలకు చేరవెయ్యాలని కూడా అందులో పేర్కొన్నారు. గతంతో పెన్షన్‌లు వలంటీర్ల ద్వారా అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండు నెలలకు సంబంధించిన పెన్షన్‌ను వలంటీర్ల లేకుండానే సచివాలయ సిబ్బందితో పాటు ఇతర శాఖలకు సంబంధించిన ఉద్యోగులతో 1వ తేదీన ఉదయం 6 గంటల నుంచి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇంటి వద్దనే లబ్ధిదారులకు అందిస్తున్నది. ఈ నేపథ్యంలో గత వలంటీర్లకు సంబంధించిన గ్రూపులను కూడా తొలగించటంతో భవిష్యత్తులో ఎటువంటి నిర్ణయాలు వస్తాయోననే ఆసక్తిగా గమనిస్తున్నారు.



ప్రజా ఫిర్యాదులు వింటున్న అధికారులు

పరిష్కారం చూపాలి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు 206 దరఖాస్తులు

భీమవరం టౌన్, ఆగస్టు 5 : ప్రజా ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపాలని కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో శివన్నారాయణ రెడ్డి పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం ఉండాలన్నారు. వచ్చిన ఫిర్యాదులు మళ్లీ తిరిగి రాకుండా పరిష్కారం చూపాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. సోమవారం జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన 206 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల్లో కొన్ని ఈ విధంగా ఉన్నాయి.

- నాలుగు సంవత్సరాల క్రితం తన భర్త ట్రాక్టరు ప్రమాదంలో చనిపోయారని తాను ముగ్గురు పిల్లలతో కుటుంబం పోషణ భారంగా ఉంది. తన భర్తకు రావలసిన ప్రమాద బీమా ఇప్పటివరకు రాలేదు. దయచేసి ప్రమాద బీమా సొమ్ము ఇప్పించాలని ఆచంట మండలం వంకటాల చెరువు.కు చెందిన కె అనంత లక్ష్మి ఫిర్యాదులో కోరారు.
- తన భర్త చనిపోయి 19 నెలలు అయ్యిందని, తనకు ఏ ఆధారం లేదని వితంతు పింఛను ఇప్పించాలని భీమవరంలోని చెక్కవారివీధికి చెందిన కమ్మల సత్యవతి ఫిర్యాదులో కోరారు.
- కొప్పరు గ్రామ పంచాయతీలో సుమారు రూ.50 లక్షలు నిధులు అవినీతి జరిగిందని, వెంటనే అధికారులు దర్యాప్తు చేసి పంచాయతీ నిధులు పక్కదారి పట్ట కుండా చూడాలని నరసాపురం మండలం కొప్పరుకు చెందిన యాదం రెడ్డి సూరిబాబు, పోలిశెట్టి మధుసూధనరావు ఫిర్యాదులో కోరారు.
- కాళ్ల మండలం కాళ్లకూరు గ్రామం నుంచి గ్రామంలో పేరంటాలమ్మ పోరంబోకు చెరువును 30 సంవత్సరాలుగా పశువుల తాగునీరు కోసం వినియోగిస్తున్నాం. ఇటీవల పంచాయతీ వారు చెరువును చేపల పెంపకానికి వేలంపాట పెట్టి ఉన్నారు. పాట దారుడు చేపల మేతగా నానా వ్యర్థాలు చెరువులో వేయటం వలన చెరువులో నీరు కలుషితమై పశువులు నీరు తాగడం లేదు. వెంటనే చర్యలు తీసుకోవాలని వలపు వెంకట సత్యనారాయణ, ముగాళ్ళ నరసింహమూర్తి, మేక వెంకటేశ్వర్లు ఫిర్యాదులో కోరారు.
- తన అత్తయ్య మస్కట్ దేశానికి పని కోసం వెళ్లింది. మూడు నెలలుగా అనారోగ్యం కారణంగా ఆమె చాలా ఇబ్బందులు పడుతున్నారు. తిరిగి తీసుకురావడానికి డబ్బు అవుతుందని ఏజెంట్ చెప్పగా రూ.లక్షా 50వేలు ఏజెంట్‌కు ఇచ్చామని, ఆ సొమ్మును ఏజెంట్ వాడుకుని తమ అత్తయ్యను తీసుకురావడానికి మాయ మాటలు చెబుతున్నారు. వెంటనే చర్యలు తీసుకుని మా అత్తయ్యను మస్కట్ నుంచి ఇండియాకు తీసుకురావాలని పాలకొల్లుకు చెందిన పూనాల శ్రీనివాస్ ఫిర్యాదులో కోరారు.

నకిలీ విత్తనాలతో నట్టేట ముంచారు

పంట డబ్బులివ్వకుండా ఇబ్బందులు.. దళారులపై చర్యలు తీసుకోవాలి

పురుగుల మందు డబ్బాలతో రైతుల ఆందోళన



పురుగుల మందు డబ్బాలతో ఆందోళన చేస్తున్న మొక్కజొన్న రైతులు

ద్వారకాతిరుమల, ఆగస్టు 5: నకిలీ విత్తనాలను అంటగట్టడమే కాకుండా మొక్కజొన్న పంట డబ్బులను దళారులు తమకివ్వకుండా ఇబ్బందుల పాలు చేస్తున్నారని, జిల్లా అధికారులు స్పందించకుంటే తమకు పురుగుల మందులే దిక్కంటూ కొందరు రైతులు సోమవారం ఆందోళన చేశారు. సీహెచ్ పోతే పల్లి పొలాల్లో వారు పురుగుల మందుల డబ్బాలతో ఆందోళనకు దిగారు. బాధిత రైతులు తెలిపిన వివరాలివి... సీహెచ్ పోతేపల్లి, ఈస్టు యడవల్లి గ్రామాలకు చెందిన రైతులు కొందరు దళారుల వద్ద మొక్కజొన్న విత్తనాలు తీసుకున్నారు. ఎకరాకు ఐదు నుంచి ఆరు టన్నుల వరకు దిగుబడి వస్తుందని, రూ.80వేలకు మించి ఆదాయం వస్తుందని దళారులు నమ్మబలికారన్నారు. తీరా పంటకోత సమయానికి మూడు టన్నుల లోపే దిగుబడి వచ్చిందని, నకిలీ విత్తనాలతో తమను నట్టేట ముంచారని ఆవేదన చెందారు. మరోవైపు పండిన పంటను వారు తీసుకుని నాలుగు నెలలు గడిచినా ఇప్పటివరకు తమకు డబ్బులు చెల్లించలేదని వాపోయారు. అప్పులు చేసి పొలాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నామని, దళారులు డబ్బులు చెల్లించకుంటే ఆత్మహత్యలే తమకు శరణ్యమని రైతులు వాపోయారు.



కుప్పకూలిన ఇండెక్స్

జిల్లాలో మదుపుదారుల నష్టం రూ.100 కోట్లపైనే .. స్టాక్ మార్కెట్‌లో బ్లాక్ మండే

స్టాక్ మార్కెట్‌లో మరో బ్లాక్ మండే నమోదైంది. సోమవారం ఇండెక్స్ భారీగా కుప్పకూలడంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మదుపుదారులు భారీగా నష్టపోయారు. సుమారు రూ.100 కోట్లు సంపద ఆవిరైనట్లు అంచనా. అన్ని రంగాల షేర్లు భారీగా పతనం అవ్వడంతో మదుపుదారుల్లో భయాందోళన నెలకొన్నది.

నరసాపురం, ఆగస్టు 5: ఇరాన్, ఇజ్రాయెల్‌ల మధ్య యుద్ధం, అమెరికాలో ఆర్థిక మాంద్యం, పెరిగిన నిరుద్యోగం, జపాన్‌లో ఎన్నడూ లేని విధంగా నెలకొన్న ఆర్థిక పరిస్థితుల ప్రభావం భారత్ మార్కెట్‌పై కూడా పడ్డాయి. దీంతో ఆరంభం నుంచి ఇండెక్స్ పతనం అవుతూ వచ్చింది. కనీసం ఉన్న స్టాక్‌ను అమ్ముకునే ఛాన్స్ కూడా ఇవ్వలేదు. దీంతో మదుపుదారులు ఏం చేయాలో తెలియక సూచిలను చూస్తూ ఉండిపోయారు. ఏ సమయంలో కూడా మార్కెట్‌లో రికవరి కనిపించలేదు. కొవిడ్ సమయంలో మార్కెట్ ఈ తరహాలో పతనమైంది. మళ్లీ ఇప్పుడు ఆదే రీతిలో పడుతుండటంతో మదుపుదారుల్లో భయం నెలకొంది. జిల్లాలో నరసాపురం, పాలకొల్లు, భీమవరం, మార్టేరు, పెనుగొండ, ఆకివీడు, ఉండి, తణుకు, టీపీగూడెం, ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు ప్రాంతాల్లో వందల సంఖ్యలో స్టాక్ మార్కెట్ మదుపుదారులు ఉన్నారు. ఇటీవల బడ్జెట్, కొన్ని కంపెనీల త్రైమాసిక ఫలితాలు ఆశాజనకంగా ఉండటంతో ఇండెక్స్ పెరుగుతూ వచ్చింది. ఈ దశలో చాలా మంది మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతూ వచ్చారు. ఊహించని విధంగా గత వారంలో అమెరికా జాబ్‌డేటా, పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణం నెలకొనడంతో సోమవారం ఒక్కసారిగా మార్కెట్ కుప్పకూలింది. మదుపుదారులు ఈపరిస్థితిని ఊహించలేదు. దీంతో రానున్న రోజుల్లో సూచిలు ఏవిధంగా ఉంటాయన్న భయం మదుపుదారుల్ని వెంటాడుతోంది.

యుద్ధం, ఆర్థిక మాంద్య ప్రభావం

ప్రధాని మోదీని కలసిన రాష్ట్ర ఎంపీలు



7

పోలవరం ప్రాజెక్టును వైసీపీ నిర్లక్ష్యం చేసింది


సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్ర యాదవ్

పోలవరం, ఆగస్టు 5 : జగన్మోహన్‌రెడ్డి పోలవరం ప్రాజెక్టుని నిర్లక్ష్యం చేసి కాఫర్ డ్యాములు ఇరువైపులా మూయకపోవడం వలన డయాఫ్రం వాల్ దెబ్బతినడం, ప్రాజెక్టు నిర్మాణం జాప్యం జరగడానికి కారణమని భారత చైతన్య యువ జన పార్టీ రాష్ట్ర నాయకులు బోడె రామచంద్ర యాదవ్ ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టుని సోమవారం ఆయన పరిశీలించారు. ప్రాజెక్టులో హిల్‌వ్యూ, స్పిల్‌వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యాములు, పవర్ హౌస్ ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణంపై చిత్తశుద్ధి లేకుండా రివర్స్ టెండరింగ్ పేరిట వివాదాలు సృష్టించి రూ.600 కోట్లు ఆదా చేశామని కల్లబొల్లి మాటలు చెప్పి జాప్యం చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు ద్వారా ప్రజలకు రాష్ట్రానికి మంచి చేయాలని కోరారు. ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీల విషయంలో యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు.

పారితోషికం చెల్లింపులో ఇంటర్ బోర్డు కాలయాపన

ఏలూరు అర్బన్, ఆగస్టు 5 : ఈ ఏడాది మార్చిలో జరిగిన ఇంటర్మీడియేట్ పరీక్షల విధులు నిర్వహించిన జూనియర్ అధ్యాపకులకు పారితోషకాన్ని ఇంత వరకు చెల్లించకుండా ఇంటర్ బోర్డు కాలయాపన చేస్తోందని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ (పీఎల్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు అంబేడ్కర్, ఉపాధ్యక్షుడు శ్యాంప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో పరీక్షల విధుల నిమిత్తం బకాయిపడిన రూ.80 లక్షలను అధ్యాపకులకు చెల్లించకుండా ఇంటర్ బోర్డు స్వాహా చేసిందని ఆరోపించారు. పరీక్షలు ముగిసి నెలలు గడుస్తున్నా బకాయిలు ఇవ్వకుండా జాప్యం చేస్తుండటంపై విద్యాశాఖ మంత్రి లోకేష్ జోక్యం చేసుకుని పారితోషకం బకాయిలను ఇప్పించాలని డిమాండ్ చేశారు.

వివరాలివ్వండి : ఆర్ఐవో

జూనియర్ అధ్యాపకుల యూఐడీ వివరాల ఆధారంగా ఈ ఏడాది పరీక్షల విధుల పారితోషకాన్ని ఇంటర్ బోర్డు నేరుగా సంబంధిత అధ్యాపకుల బ్యాంకు ఖాతాలకు జమ చేసిందని ఇంటర్మీడియేట్ విద్యా మండలి ప్రాంతీయ పర్యవేక్షణాధికారి చంద్రశేఖరబాబు తెలిపారు. కొందరు లెక్చరర్లు బ్యాంకు ఖాతా సంఖ్యలను తప్పుగా నమోదు చేయడంవల్ల డబ్బులు పడకపోవడంతో, అటువంటివారు తమను సంప్రదిస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. పారితోషకం నిధులను ఇంటర్ బోర్డు స్వాహా చేసిందని ఆరోపించడం సరికాదన్నారు.

నలుగురికి ఇన్‌ఫ్లూయెంజా

ఆకివీడు రూరల్ ఆగస్టు 5 : ఆకివీడు మండలం అజ్జమూరులో ఒక బాలుడుకి ఇన్‌ఫ్లూయెంజా వైరస్ పాజిటివ్ అని ప్రాథమిక పరీక్షలో తేలింది. దగ్గుతో బాధపడుతున్న బాలుడికి పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ చూపించిందని వైద్య సిబ్బంది తెలిపారు. అయితే ఆ బాలుడికి జ్వరం, రొంప లక్షణాలు లేవన్నారు. ఆకివీడులో ఇద్దరు, కోళ్ళపర్రు, అజ్జమూరులలో ఒక్కొక్కరుతో మొత్తం నలుగురికి పాజిటివ్ వచ్చిందన్నారు. వారి నివాసంలోనే ఐసొలేషన్‌లో ఉంచినట్లు వారు తెలిపారు. అయితే మరొక పరీక్ష నిర్వహించాకే వెల్లడించే అవకాశం ఉందన్నారు. పాజిటివ్ వచ్చిన వారి నివాసాల వద్ద వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

ప్రధాని మోదీని కలసిన రాష్ట్ర ఎంపీలు


మోదీని కలిసిన మంత్రి శ్రీనివాసవర్మ, పురందరేశ్వరీ, సీఎం రమేష్

భీమవరం టౌన్, ఆగస్టు 5 : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సహాయ, సహకారాలు అందించాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరామని కేంద్ర ఉక్కు,భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. ఢిల్లీలో సోమవారం అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరీతో కలిసి మోదీని కలిశామన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేక నిధులు ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపామన్నారు. ప్రస్తుత రాష్ట్ర రాజకీయ పరిస్థితులను ఆయన వివరించామని చెప్పారు. తాము అడిగిన వాటి ప్రధాని సానుకూలంగా స్పందించారన్నారు. అదే విధంగా తన తండ్రి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి, తనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పారని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ తెలిపారు.

ఆత్మహత్యకు పాల్పడిన రైతు వివరాల సేకరణ


ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబ వివరాలు సేకరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పోలవరం, ఆగస్టు 5 : పోలవరం మండలం గూటాలలో శనివారం ఆత్మహత్యకు పాల్పడిన గూటాల కౌలు రైతు పలకంశెట్టి రామకృష్ణ కుటుంబాన్ని సోమవారం వ్యవసాయ శాఖ సంచాలకులు పీజీ బుజ్జిబాబు పరామర్శించి వివరాలు సేకరించారు. ఆత్మహత్యకు పాల్పడిన రైతు తొమ్మిది ఎకరాల వరకూ కౌలుకి భూమి తీసుకుని వ్యవసాయం చేశాడని, సొంత భూ మి అర ఎకరం ఉన్నదని తెలిసిందన్నారు. ఐదేళ్ల నుంచి పండించిన పంటల వివరాలను, రుణాల వివరాలను సేకరించామని తెలిపారు. అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్టు విచారణలో నిర్ధారణ అయ్యిందని ప్రభుత్వం నుంచి అంద వలసిన సహాయం అందించేలా చర్యలు తీసుకుం టామని తెలిపారు. మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు స్థానిక వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నిడమర్రు సర్పంచ్ అగచాట్లు


నిచ్చెన పట్టుకొని వీధిలైట్లు వేయిస్తున్న సర్పంచ్ పాట్నూరి ఉమా మహేశ్వరరావు

నిడమర్రు ఆగస్టు 5 : గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం కల కనుచూపు మేరలో తీరేటట్లు లేదు. గ్రామాలలో వర్గ పోరుతో బలహీన వర్గానికి చెందిన గ్రామ సర్పంచ్‌కు పంచాయతీ సిబ్బంది సహకరించకపోవడంతో తాను నమ్మిన సిద్ధాంతాల కోసం తన పదవికి మచ్చ తెచ్చుకోలేనని భావించి ఎలక్ట్రీషయన్‌తో కలసి విద్యుత్ దీపాల మరమ్మతు పనులను నిర్వహించారు. ఇదేమిటీ సర్పంచ్ గారు మీరే నిచ్చెన మోసు కొని వెళ్తున్నారని గ్రామ స్థులు ప్రశ్నించగా పంచాయతీలో ముగ్గు రు స్వీపర్లు ఉన్నప్పటికీ నిచ్చెన మోయడానికి సహకరించమంటే అది మా పనికాదంటున్నారన్నారు. పంచాయతీ సిబ్బంది, కార్యానిహరణాధికారి సహకరించడం లేదన్నారు. అధికారులు సిబ్బంది కుమ్మక్కై తనను మానసికంగా హింసిస్తున్నారన్నారు. పంచాయతీలో నాలుగేళ్లుగా నిధులు లేకపోవడంతో ఆర్థికంగా తీవ్ర లోటుతో నెట్టుకొస్తున్నారు. పంచాయతీ సిబ్బందికి ఇప్పటికే తొమ్మిది నెలల జీతం బకాయిలు ఉండడంతో వారు సహకరిం చడం లేదని తెలస్తోంది. అంతేగాక కార్యానిర్వహణాధికారి తన సిబ్బందితో పని చేయించుకోలేని దుస్థితి ఇక్కడ నెలకొంది. ఉన్నతాధికారులు ఇప్పటికైన దృష్టి సారించి గాడిలో పెట్టాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బీటలు వారి.. పెచ్చులూడి..

» అధ్వానంగా వసతి గృహాలు » తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు » కొత్త ప్రభుత్వంపైనే ఆశలు

వసతుల కొరతతో ప్రభుత్వ వసతి గృహాలు అధ్వానంగా మారుతున్నాయి. శిథిలమైన భవనాలలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. కిటికీలకి మెస్‌లు లేకపోవడంతో దోమల బాధతో అల్లాడిపోతున్నారు. బీటలు వారిన శ్లాబు ఎప్పుడు కూలిపోతుందోనని ఆందోళనతో నిద్రకు దూరమవుతున్నారు. ఇక వర్షం వస్తే సరేసరి. విద్యార్థుల గదుల్లోకి నీరు చేరిపోతుంది. వసతి గృహాల్లో తమ పిల్లలు పడుతున్న ఇబ్బందులు చూసిన తల్లిదండ్రులు వారిని తమ ఇళ్లకు తోసుకోని వెళ్లిపోవడానికి సమాయత్తమవుతున్నారు.


అధ్వానంగా ఉన్న పెంటపాడు ఎస్సీ బాలికల వసతి గృహం

పెంటపాడు, ఆగస్టు 3 : విద్యార్థులు ఉండే ప్రభుత్వ వసతి గృహాలు వసతుల కొరతతో అధ్వానంగా తయారయ్యాయి. పెంటపాడులో ఎస్సీ బాలురు, బాలికలు, బీసీ బాలురు, పరిమెళ్ళలో ఎస్సీ బాలురు కలిపి మొత్తంగా నాలుగు వసతి గృహాలున్నాయి. వీటిలో పెంటపాడులో ఉండే బీసీ హాస్టల్‌లో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో గత ప్రభుత్వ హయాంలో ఈ భవనాన్ని సచివాలయం-2గా మార్చేశారు. అయితే మిగిలిన మూడు హాస్టల్స్‌లో వసతులు లేక దారుణంగా తయారయ్యాయి. పెంటపాడు బాలికల, బాలుర హాస్టల్ ఒకే ప్రాంగణంలో ఉంటాయి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఎప్పుడూ కూడా హాస్టల్స్ గురించి పట్టించుకోలేదు. హాస్టల్స్ అభివృద్ధి మాట దేవుడేరుగు.. కనీసం మౌలిక సదుపాయాలే కల్పించలేకపోయారు. దీంతో హాస్టల్ భవనాలు మొత్తం శిథిలావస్థకు చేరుకున్నాయి. భవనాల శ్లాబు పెచ్చులుగా ఊడిపోతున్నాయి. దీంతో వర్షం వస్తే చాలు విద్యార్థులు ఉండే గదుల్లోకి వర్షం నీరు వచ్చేస్తుంది. భవనాలపై పిచ్చి మొక్కలు పెరిగిపోయి బీటలు వారుతున్నాయి. కనీసం విద్యార్థులు ఉండే కిటికీలు, తలుపులకు మెస్‌లు కూడా లేవు. వర్షం వస్తే పెంటపాడు బాలికల హాస్టల్ ప్రాంగణం మొత్తం నీటితో మునిగిపోయి చిత్తడిగా మారుతుంది. దోమలు, ఇతర కీటకాలతో ప్రమాదకరంగా ఉంటుంది. దోమల బాధతో విద్యార్థులకు కంటి మీద కునుకు లేకుండా పోతుంది. ఈ హాస్టల్‌కి గేటు లేకపోవడంతో వార్డెన్ అరుణ జ్యోతి రూ. ఆరు వేలతో గేటును అమర్చారు. హాస్టల్ భవనాలు మొత్తం శిథిలావస్థకు చేరడం, ఎప్పుడు కూలిపోతాయా అన్నట్లు ఉండడంతో విద్యార్థుల సంఖ్య కూడా క్రమేపి తగ్గిపోతుంది. కొత్తగా తమ పిల్లలను హాస్టల్స్‌లో చేర్చాలని వచ్చే తల్లిదండ్రులు ఇక్కడ పరిస్థితి చూసి భయపడి తమ పిల్లలను వెనక్కి తీసుకు వెళ్ళిపోతున్నారు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం రావడంతో హాస్టల్స్‌కు మంచి రోజులు వస్తాయని విద్యార్థులు ఆశగా ఎదురు చూస్తున్నారు.


పెచ్చులూడుతున్న హాస్టల్ భవనం శ్లాబ్

మా భూముల్ని మాకు ఇప్పించండి

శివగిరి నిర్వాసితుల డిమాండ్


తమ వద్ద ఉన్న భూముల ఆధారాలు చూపుతున్న శివగిరి నిర్వాసితులు

జీలుగుమిల్లి, ఆగస్టు 4 : పోలవరం నిర్వాసిత గ్రామం శివగిరి గిరిజనులకు ప్రభుత్వం కేటాయించిన భూముల్ని మండలంలో కొందరు గిరిజనులు అక్రమంగా సాగు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వారు ఆందోళన చెందుతున్నారు. పి.నారయణపురంలో శివగిరి నిర్వాసితులకు 218 ఎకరాల భూమిని ప్రభుత్వం భూమికి భూమి కింద కేటాయించింది. ఆయా భూములకు సంబంధించి పదేళ్ల క్రితం పాసు పుస్తకాలు ఇచ్చారు. అనంతరం ఆయా భూములు కొంత జల్లేరు ముంపు రిజర్వాయరు పరిధిలోకి వచ్చాయి. దీంతో ప్రభుత్వం వారికి రాచన్నగూడెం, కామయ్యపాలెం గ్రామాల్లో కొంత భూమిని కొనుగోలు చేసింది. అయితే ఇంకా తమకు 70 ఎకరాల భూమి ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని ఆ గ్రామ నిర్వాసితులు చెబుతున్నారు. అయితే ముందుగా కేటాయించిన (జల్లేరు ముంపు రిజర్వాయరు) భూముల్ని గత పదేళ్లుగా కౌలుకు ఇచ్చి జీవనోపాధి సాగిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆ భూముల్లో కొందరు అక్రమంగా చొరబడుతున్నారన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి తమకు రావాల్సిన భూములు తమకు కేటాయించి సర్వే చేయించి పొజిషన్ చూపాలని వారు కోరారు. సమస్యను తెలపిన వారిలో నిర్వాసిత గిరిజనులు అరగంటి కృష్ణకుమారి, బి.తమ్మన్నదొర, కె.రాములమ్మ, కె.విజయ ఉన్నారు.

పూర్తి డేటా లేదు

ఈ విషయమై సంబంధిత వీఆర్వో ముత్యంను వివరణ కోరగా శివగిరి వాసులకు ఎంత భూమి కేటాయించారో తమ వద్ద పూర్తి డేటా లేదన్నారు. జల్లేరు ముంపు భూముల్లో కొంత మిగులు భూమి ఉందన్నారు. సమస్య తహసీల్దారు దృష్టికి తీసుకెళతామన్నారు.

సొసైటీలో రుణం స్వాహా

» విచారణ చేసి, న్యాయం చేయండి
» గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేసిన మృతుని కుమారుడు

పెదవేగి, ఆగస్టు 5 : చనిపోయిన వ్యక్తి పేరుతో సొసైటీలో రుణం మంజూరు చేసిన సంఘటన పెదవేగి సొసైటీలో జరిగింది. దీనికి సంబంధించిన మృతుని కుమారుడు తిప్పాభట్ల సత్యనారాయణ ఏలూరు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై విచారణ చేయించి, న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదులోని విషయాలు ఇలాఉన్నాయి. తిప్పాభట్ల శ్రీరామచంద్రమూర్తి(పెద్దరాముడు) అనేవ్యక్తి పెదవేగి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రుణ లావాదేవీలు నిర్వహిస్తూ వచ్చారు. శ్రీరామచంద్రమూర్తి 2020 ఫిబ్రవరిలో మృతి చెందారు. అయినప్పటికీ ఆయన పేరుతో 2020, 2021, 2022 సంవత్సరాల్లో రుణం మంజూరు చేస్తూ, లావాదేవీలు నిర్వహించారు. ఈ విషయంలో సొసైటీ కార్యదర్శి తిప్పాభట్ల శ్రీరామచంద్రమూర్తి(చిన్నరాముడు)తోపాటు సిబ్బంది సహకారంతో ఇదంతా చేశారని, దీనిపై గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశించినా, చిన్నరాముడు తన పలుకుబడితో విచారణ సక్రమంగా చేయకుండా అడ్డుకున్నారని, దీనిపై విచారణ చేయించి, న్యాయం చేయాలని మృతుని కుమారుడు సత్యనారాయణ అధికారులకు విన్నవించారు.

విద్యాశాఖలో ఉద్యోగుల మధ్య వివాదం

చేయి కోసుకున్న ఉద్యోగి

ఏలూరు అర్బన్, ఆగస్టు 5 : మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో-2)కి, మండల విద్యా శాఖ కార్యాలయంలో పని చేస్తున్న ఓ ఉద్యోగికి మధ్య నెలకొన్న వివాదంలో చిరుద్యోగి చేయి కోసుకున్న సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏలూరు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో పనిచేస్తున్న ఎంఈవోతో అక్కడే విధులు నిర్వహిస్తున్న ఓ చిరుద్యోగి, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లకు కొంతకాలంగా వివాదం జరుగుతుంది. గత శనివారం నిర్వహించిన సీఆర్పీల సమావేశం సందర్భంగా మధ్యాహ్న భోజన సమయంలో ఎంఈవోకు, చిరుద్యోగికి మధ్య సంవాదం నెలకొనడం, అదే సందర్భంలో కార్యాలయంలోకి వెళ్లిన ఉద్యోగి తన చేతిని కోసుకోవడంతో గాయాలపాలయ్యాడు. అప్రమత్తమైన ఎంఈవో రక్తస్రావంతోవున్న ఉద్యోగిని ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్స చేయించారు. చేతికైన గాయానికి కుట్లు వేశారు. ఈ వివాదం కాస్తా కలెక్టర్ నేతృత్వంలో నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌కు తీసుకెళ్ళడానికి ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో సంబంధిత ఉద్యోగిని మరోచోటకు బదిలీచేయడంగాని లేదా తనను బదిలీచేయడంగాని ఏదోఒకటి చేయాలని అభ్యర్థిస్తూ సోమవారం ఏలూరు మండల ఎంఈవోలిద్దరూ, కార్యాలయ సిబ్బందితోసహా తరలివచ్చి డీఈవో అబ్రహంను అభ్యర్థించారు. ఇటువంటి వివాదాస్పద ఉద్యోగులతో తాము పని చేయించుకోలేమని, భవిష్యత్తులో ఏదైనా అఘాయిత్యానికి పాల్పడితే బాధ్యులెవరతారని డీఈవోకు నివేదించినట్టు తెలిసింది. ప్రస్తుతం ఈ వివాదం ఉపాధ్యాయవర్గాల్లో హాట్ టాపిక్‌గా నడుస్తోంది.

ఆచంట ఎమ్మెల్యే పితాని సోదరుడి మృతి


సూర్యనారాయణ పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న తెలంగాణ రిటైర్డ్ సీఎస్ సోమేశ్‌కుమార్, పితాని సూర్యనారాయణ(ఫైల్)

పోడూరు, ఆగస్టు, 5 : మండలంలోని కొమ్ముచిక్కాలకు చెందిన ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సోదరుడు, ప్రముఖ లేస్ వ్యాపారి, విద్యావేత్త పితాని సూర్యనారాయణ(76) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పితాని సూర్యనారాయణ ఆంధ్రా యూనివర్శిటీ పాలకవర్గ సభ్యుడిగా, లేస్ ఎగుమతిదారుడిగా, పెనుగొండ ఎస్‌వీకేపీ జూనియర్ కళాశాల చైర్మన్‌గా పని చేస్తున్నారు. హైదరాబాదులో ఉన్న ఎమ్మెల్యే పితాని తన సోదరుడు సూర్యనారాయణ మృతి సమాచారం తెలియడంతో హుటాహుటీన స్వగృహానికి చేరుకుని సోదరుడు భౌతికకాయాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. బంధువులు, అభిమానులు ఎమ్మెల్యే పితానిని కలిసి ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు. సూర్యనారాయణకు అత్యంత సన్నిహితుడు తెలంగాణ రిటైర్డ్ సీఎస్ సోమేశ్‌కుమార్ కొమ్ము చిక్కాలకు వచ్చి సూర్యనారాయణ పార్థివ దేహాన్నికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యేలు, అల్లు వెంకట సత్యనారాయణ,, బండారు మాధవనాయుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ దేవళ్ల ప్రసాదు, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, లేస్ ఎగుమతిదారుడు కలవకొలను తులసీరావు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు సూర్యనారాయణ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

'బందా' కాంస్య విగ్రహావిష్కరణ


కనకలింగేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కుటుంబ సభ్యులు

కైకలూరు, ఆగస్టు 5: సినీ, రంగస్థల నటుడు బందా కనక లింగేశ్వరరావు కాంస్య విగ్రహాన్ని ఆటపాకలో సోమవారం ఆవిష్కరించారు. ఆటపాక కనకలింగేశ్వర స్వామి వంశపారంపర్య ధర్మకర్తలైన బందా కనకలింగేశ్వర రావు కాంస్య విగ్రహాన్ని ఆయన మనవడు కృష్ణసాయి సిద్ధార్థ ఆవిష్కరించారు. కనకలింగేశ్వర రావు ఆటపాక గ్రామంలో జన్మించి సారంగధర, బాలనాగమ్మ, పాదుకా పట్టాభిషేకం సినిమాలతో పాటు ఆంధ్ర నాటక రంగ స్థలంపై విభిన్న పాత్రల్లో నటిం చారు. ఆయన గుర్తుగా కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేయడం అభినందనీ యమని గ్రామస్థులు పేర్కొన్నారు. బందా వంశీకులు బందా గోపాలకృష్ణ గాంధీ, బందా సత్యనారాయణ, ఆలయ ఈవో వీఎస్‌కె శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని కాపాడిన పోలీసులు



ఏలూరు క్రైం, ఆగస్టు 5 : ఓ యువకుడు మానసిక సంఘర్షణకు గురై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలని భావించాడు. నేరుగా ఏలూరు వచ్చే శాడు. విజయవాడలో ఉన్న తన అక్కకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. ఆ క్షణమే విజయవాడలో ఉన్న అతని అక్క లక్ష్మి 112 కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసింది. తనతమ్ముడు నక్కా రాజేష్(31) ఏలూరు రైల్వే స్టేషన్‌లో ఉన్నాడని ఆత్మహత్య చేసుకుంటాన్నాడని చెప్పడంతో విజయవాడ కంట్రోల్ రూమ్ పోలీసులు, ఏలూరు టూటౌన్ సీఐ ఎం.ప్రభాకర్‌కు సమాచారమిచ్చారు. దీంతో వెంటనే సీఐ ఆదేశాల మేరకు కానిస్టేబుళ్ళు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. విజయవాడలో ఉన్న లక్ష్మీ నుంచి వాట్సప్ ద్వారా ఆమె తమ్ముడు రాజేష్ వివరాలు, ఫోటోలు పొందారు. ఏలూరు కొత్త బస్టాండ్‌లో ఉన్నట్లు ప్రాథమికంగా సమాచారం తెలుసుకుని పోలీసులు వెంటనే అక్కడకు వెళ్ళి ఆ యువకుడిని గమనించి స్టేషన్‌కు తీసుకువచ్చారు. సీఐ ప్రభాకర్ రాజేష్‌కు కౌన్సెలింగ్ చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

వ్యక్తి అనుమానాస్పద మృతి


రాజేష్(ఫైల్)

పెంటపాడు, ఆగస్టు 5 : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం ప్రత్తిపాడులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇవి. గణపవరంనకు చెందిన గండికోట రాజేష్(31) చేపల ఫ్యాక్టరీలో ప్యాంకిగ్ పని చేస్తుంటాడు. ఆదివారం రాత్రి 10 గంటలకు తన ఇంటి వద్ద పడుకున్నాడు. సోమవారం తెల్లవారు జామున చూసేసరికి రాజేష్ కనపడలేదు. దీంతో కుటుంబ సభ్యులు పనికి వెళ్ళి ఉంటాడని భావించారు. అయితే ప్రత్తిపాడు పొలాల వద్ద అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెంది ఉండడంతో అక్కడి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. 11 గంటలు దాటిన తరువాత భార్య దానేశ్వరి తన భర్త రాజేష్‌కు ఫోన్ చేయడంతో పక్కనే ఉన్న స్థానికులు ఫోన్ తీసి ప్రత్తిపాడు గ్రామంలోని పొలాలలో రాజేష్ చనిపోయి ఉన్నట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ శీలం శంకర్ పరిశీలించారు. భార్య దానేశ్వరి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 5 : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒక వ్యక్తి సోమవారం మృతి చెందాడు. విజయవాడకు చెందిన నిర్మల్‌నాయక్ (40) అతని భార్య పింకి నాయక్, కుమార్తె స్విష్టి, నిర్మల్‌నాయక్ సోదరుడు మౌలాలీ నాయక్‌లు కలిసి మోటారు సైకిల్‌పై ఈనెల 4వ తేదీన ద్వారకాతిరుమలలోని వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్ళారు. తిరిగి వస్తుండగా ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్ మదీనా హోటల్ ఎదురుగా రోడ్డుపైనే పార్కింగ్ చేసిన లారీని నిర్మల్‌నాయక్ ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో వీరంతా తీవ్ర గాయాలపాలవ్వగా విజయవాడ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న నిర్మల్‌నాయక్ సోమవారం మృతి చెందారు. మిగిలిన వారు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సమాచారం ఏలూరు రూరల్ పోలీసులకు అందడంతో ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి మృతి

ఆకివీడు, ఆగస్టు 5 : లారీని తప్పించపోయి ఢీకొట్టి పడిపోయిన యువకుడు సుగుణ విజయవాడలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. భీమవరం గునుపూడికి చెందిన సుగుణ స్థానిక మీషో ఆఫీసులో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఇంటికి తిరిగి వెళ్ళుతుండగా స్థానిక గుమ్ములూరు సెంటర్‌లో లారీని తప్పించపోయి ఢీకొట్టడంతో పడిపోయిన సుగుణపై నుంచి ఆటో వెళ్ళడంతో కుడికాలు నుజ్జునజ్జు అయిన సంగతి తెలిసిందే. మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ, గుంటూరు తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేశారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మొగల్తూరు, ఆగస్టు 5 :మండలంలోని పేరుపలెం బీచ్‌లో గల్లంతైన కొల్లి జాన్‌బాబు అనే యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. ఆదివారం ఉదయం తణుకుకు చెందిన స్నేహితులతో పేరుపాలెం బీచ్‌కు వచ్చారు. తీరంలో సరదాగా గడిపిన అనంతరం సముద్ర స్నానానికి దిగిన స్నేహితులు ఆరుగురిలో జాన్‌బాబు అలల ఉధృతికి గల్లంతయ్యాడు. గల్లంతైన ప్రదేశానికి సుమారు తొమ్మిది కిలోమీటర్ల దూరంలోని మోళ్ళపర్రు ప్రాంతంలోని ఏటిపొర ప్రాంతంలో సోమవారం ఉదయం జాన్‌బాబు మృతదేహం తీరానికి కొట్టుకువచ్చింది. స్నేహితుడు పవన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ బి.సత్యనారాయణ తెలిపారు.

నలుగురు నిందితుల అరెస్టు



కామవరపుకోట, ఆగస్టు 5 : ఒక ముఠాగా ఏర్పడి వాహనాల్లో టైర్లను అపహరిస్తున్న నలుగురు నిందితులను అరెస్టు చేసినట్టు తడికలపూడి ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. సోమ వారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల బస్సులో సామగ్రిని, టైర్లను అపహరిస్తున్నట్టు అనుమానితులైన పుచ్చులపాటి చందు, కొల్లా ఈశ్వర్, పాలగాని సాయిదుర్గారావు, బొడ్డు వెంకట్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి, కోర్టుకు హాజరుపర్చామని చెప్పారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తు దాదాపు రూ.లక్షా 20 వేలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు.

ఇత్తడి వస్తువుల చోరీకి యత్నం

భీమవరం క్రైం, ఆగస్టు 5 : భీమవరం రెండో పట్టణంలోని శ్రీరాంపురంలో ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఇత్తడి వస్తువుల చోరీకి ప్రయత్నిస్తున్న వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. టూటౌన్ ఎస్ఐ సీహెచ్‌వీ రమేష్ తెలిపిన వివరాలు ప్రకారం శ్రీరాంపురంలో ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని పునఃనిర్మిస్తున్నారు. దానిలో భాగంగా ఇత్తడి వస్తువులను వెనుక ఉన్న కల్యాణ మండపంలో ఉంచారు. అయితే సోమవారం ఉదయం ప్రకాశం జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన పేదాల శ్రీను అనే వ్యక్తి డిమార్ట్ సమీపంలో నివాసముంటున్నాడు. నెంబర్ లేని ద్విచక్ర వాహనం పై వచ్చి ఇత్తడి వస్తువులను దొంగతనానికి ప్రయత్నిస్తుండగా ఆలయ ఈవో దండు వెంకట కృష్ణంరాజు మరో వ్యక్తి అతన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అయితే గతంలో కూడా సుమారు రూ.50 వేలు విలువ చేసే ఇత్తడి వస్తువులు మాయం అయినట్లుగా పోలీసులకు తెలపడంతో ఆ రూ.50 వేలను శ్రీనివాస్ నుంచి పోలీసులు రికవరీ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భర్త ఆత్మహత్యపై భార్య ఫిర్యాదు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 5 : టి.నరసాపురం మండలం బొర్రంపాలెంకి చెందిన కలపర్తి వెంకటేశ్వర రావు ఆత్మహత్య ఘటనపై మృతుడి భార్య అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జ్యోతిబసు తెలిపారు. తాపీ మేస్త్రీగా పని చేసే మృతుడి వెంకటేశ్వరరావు కుమార్తె ఏడాది క్రితం జ్వరంతో మరణించింది. దీంతో కొన్ని రోజులుగా మానసికంగా కుంగిపోతున్నాడు. ఈ క్రమంలో పది రోజుల క్రితం వెంకటేశ్వరరావు భార్య అన్నపూర్ణకు ఒంట్లో బాగోక పోవడంతో జంగారెడ్డిగూడెంలోని ఆమె చెల్లెలు నేతల సంధ్యారాణి ఇంటికి వచ్చింది. అక్కడి నుంచి వైద్యం నిమిత్తం తన తమ్ముడి ఇంటికి ఏలూరు వెళ్ళింది. ఇదిలా ఉండగా సోమవారం అన్నపూర్ణ భర్త వెంకటేశ్వరరావు జంగారెడ్డిగూడెం మరదలి ఇంటికి వచ్చాడు. అక్కడ తన భార్య లేక పోవడంతో మనస్థాపం చెంది తనతో తెచ్చుకున్న గుర్తు తెలియని పురుగు మందు తాగడంతో అపస్మారక స్థితిలోకి చేరుకుని రోడ్డుపై పడి ఉండడాన్ని చూసిన స్థానికులు 108 ద్వారా ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. భార్య అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్లబ్‌పై పోలీసుల దాడి

భీమవరం క్రైం, ఆగస్టు 5 : భీమవరం రెండో పట్టణంలోని ఒక ప్రముఖ క్లబ్‌పై ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. లక్ష ఐదు వేల 900లు స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ ఎస్ఐ సీహెచ్‌వీ రమేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కేసు నమోదు

టి.నరసాపురం, ఆగస్టు 5 : గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి గాయపడిన ఘటన పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.దుర్గామహేశ్వర రావు సోమవారం తెలిపారు. ఈ నెల 2న టి.నరసాపురం గ్రామం వెలుపల ఉన్న ఎస్సార్ పెట్రోల్ బంక్ సమీపంలో గ్రామానికి చెందిన షష్రక్ ఇమామ్ సాహెబ్ తన స్నేహితులతో కలిసి నడుచుకుంటూ టి.నరసాపురం వైపుగా వెళుతుండగా చింతలపూడి నుంచి వస్తున్న ద్విచక్ర వాహనదారుడు అతివేగంగా వెనుక నుంచి ఢీకొనడంతో ఇమామ్ సాహెబ్ తీవ్రంగా గాయపడాడు. అతడిని స్థానికులు ఏలూరు ఆంధ్రా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

బాలిక అదృశ్యంపై కేసు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 5 :బాలిక అదృశ్యంపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్టేషన్ రైటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నెల రెండో తేదీ సాయంత్రం బాలికను ఇంటి వద్ద పెట్టి తల్లి డ్వాక్రా మీటింగ్‌కు వెళ్ళింది. మీటింగ్ అయిన తర్వాత ఇంటికి వచ్చి చూస్తే బాలిక కనిపించకపోవడంతో చుట్టు పక్కల, బంధువుల ఇంటి వద్ద వెతికింది. అయినా కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. తన ఫిర్యాదులో స్థానిక డాంగే నగర్‌కు చెందిన వెంకీ అనే యువకుడిపై అనుమానం వ్యక్తం చేసినట్లు రైటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఇసుక కొరత లేకుండా చూడాలి



భీమవరం అర్బన్, ఆగస్టు 5: ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికులు పనులు కోల్పోయే పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని, ఉచిత ఇసుక విధి విధానాలు జిల్లా ప్రజలకు అందుబాటులో వుండే విధంగా చర్యలు తీసుకోవాలని ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు కోరారు. సోమవారం ప్రజా సమస్యలు పరిష్కారం మీకోసం కార్యక్రమంలో భీమవరం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కరరావుకు వినతిపత్రం అందించారు. విధివిధానాలు ప్రకటించి ఇసుక కొరత రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలిరాతి ఆదినారాయణ, గంటా కంపేశ్వరరావు, నాగేశ్వరరావు, సీతారాం ప్రసాదు తదితరులు పాల్గొన్నానరు.

స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న స్కీం వర్కర్లు

భీమవరం అర్బన్, ఆగస్టు 5 : ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న నిరుద్యోగులు చిరుద్యోగులు స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయు ఆధ్వర్యంలో కలెక్టరు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎస్వీ గోపాలం, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ కళ్యాణి మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్వాడీ ఆశ మిడ్ డే మీల్స్, ఫీల్డ్ అసిస్టెంట్స్ మున్సిపల్ తదితర రంగాలలో లక్షలాది మంది చిరుద్యోగులు పనిచేస్తున్నారన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వీరిపై స్థానిక రాజకీయ నాయకులు వేధింపులు పెరిగిపోయాయన్నారు. పని ప్రాంతాలకు ఇళ్లకు వెళ్లి స్కీం వర్కర్లని తప్పుకోవాలని మావాళ్లు చేసుకుంటారని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి జోక్యం చేసుకుని రాజకీయ వేధింపులు ఆపించాలని కోరారు. విస్సాకోడేరు వంతెన నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. సీఐటీయు ఉపాధ్యక్షులు నలుపు అంజనేయులు, జవ్వాది శ్రీనివాస్, నాయకులు ఎండీ హసీనా బేగం, విజయలక్ష్మి, చింతపల్లి లక్ష్మి లారెన్స్ కుమారి, బి.వరలక్ష్మి, ఎస్.భవాని పాల్గొన్నారు.

పంటబోదెను రక్షించాలంటూ వినతి



కాళ్ళ, ఆగస్టు 5 : తమ పొలాలకు సాగునీరు అందించే పంట బోదెను ఆక్రమణల చెర నుంచి కాపాడాలని కోరుతూ బొండాడ, బొండాడపేట రైతులు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ నాగార్జునకు ఫిర్యాదు చేశారు. కాళ్ళ మండలం బొండాడ గ్రామంలోని పంట కాలువ నుంచి బొండాడ పేటలోని మొగదిండి డ్రైయిన్ వరకు గ్రామంలో సుమారు 300 ఎకరాలు భూమిని 60 మంది రైతులు సాగు చేసుకుంటున్నామన్నారు. పంటబోదె పూర్తిగా ఆక్రమణకు గురైందని దీనివల్ల సార్వా, దాళ్వా పంటలు పండడం లేదని వాపోయారు. ఈ పంట బోదెని ఆక్రమించి సుమారు 25 మంది గృహాలు నిర్మించుకోవడమే కాకుండా ఆయా ఇళ్ళ నుంచి వచ్చే డ్రైనేజీ నీరు నేరుగా బోదెలోకి వదలడం వలన చేలు బీడు బారిన పడుతున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణలకు గురైన పంట బోదెను ప్రక్షాళన చేసి పంట పొలాలను ముంపు బారి నుంచి కాపాడాలని కోరారు. గుడ్ల సురేంద్ర, మందపాటి ప్రవీణ్, గుడ్ల సతీష్, చింతలపాటి సీతారామరాజు, తదితర రైతులు పాల్గొన్నారు.



పెంటపాడులో విరాళాల సేకరణ..బలరాంకు నగదు ఇస్తున్న చిన్నారి సహస్ర

కేరళ వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

పెంటపాడు/ భీమవరం అర్బన్ ఆగస్టు 5: కేరళ వరద బాధితులను ప్రజలంతా ఆదుకోవాలని సీపీఎం నాయకులు చిర్లా పుల్లారెడ్డి, బంకూరు నాగేశ్వరరావు కోరారు. సోమవారం పెంటపాడులో కేరళ వరద బాధితుల సహాయార్థం జోలె పట్టి విరాళాలు సేకరించారు. వీటిని కేరళ సీఎం సహాయ నిధికి పంపుతామన్నారు. పెనగంటి దుర్గా, తాడి బాలయ్య, దూలం ప్రసాద్, వడ్డాది సన్యాసిరావు, ధనబాబు, సత్తి సుబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆకివీడు మండల కోళ్ళపర్రు రాజులపేటకు చెందిన కనుమూరు రామకృష్ణంరాజు-కావ్యాల కుమార్తె సహస్ర కేరళ బాధితుల సహాయార్థం రూ. 5 వేలు నగదును సీపీఎం జిల్లా కార్యదర్శి బలరాంకు సోమవారం అందించారు.

కాళీపట్నం మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు నాగేశ్వరరావు మృతి



మొగల్తూరు, ఆగస్టు 5: కాళీపట్నం పడమర మాజీ సర్పంచ్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కడలి నాగేశ్వరరావు (82) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. పంచాయతీకి మూడు పర్యాయాలు సర్పంచ్‌గా పని చేశారు. 1982 తెలుగుదేశం ఆవిర్భావం నుంచి అదే పార్టీలో కొనసాగారు. క్రమశిక్షణ కలిగిన పార్టీ కార్యకర్తగా గ్రామంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. మాజీ ఎమ్మెల్యే బందారు మాధవ నాయుడు నాగేశ్వరరావు బౌతిక కాయాన్ని దర్శించి నివాళులర్పించారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు సంతాపం తెలిపారు.

పెంటపాడులో ఉపాధి గ్రామసభ

పెంటపాడు, ఆగస్టు 5: పెంటపాడు పంచాయతీ వద్ద సోమవారం ఉపాధి గ్రామసభ సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ అధ్యక్షతన నిర్వహించారు.ఉపాధి పనులు, పించన్లు తదితర అంశాలపై చర్చించారు. టీడీపీ నాయకులు కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం అందరూ కృషి చేయాలన్నారు. జనసేన నాయకుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో 3 సచివాలయాల నిర్మాణం కోసం లక్షల రూపాయలు ఖర్చయిందని, వాటిని గ్రామానికి వినియోగిస్తే ఎంతో అభివృద్ధి జరిగి ఉండేదనడంతో స్పందించిన వైసీపీ ఎంపీటీసీ రెడ్డి సూరిబాబు సచివాలయాలు, వలంటరీ వ్యవస్థ వల్ల గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని బదులిచ్చారు. ఇరువురి మధ్య వాగ్వాదం పెరగడంతో అక్కడ ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. నాయకులు నల్లమిల్లి చినగోపిరెడ్డి, దాసరి సతీష్‌కుమార్, ఉప సర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కనకదుర్గమ్మ ఆలయ సేవాసంఘం ప్రమాణ స్వీకారం

భీమవరం టౌన్, ఆగస్టు 5 : భీమవరం రెండో పట్టణంలోని శ్రీరాంపురంలో ఉన్న శ్రీచక్ర సహిత జగన్మాత కనకదుర్గ అమ్మవారి ఆలయ సేవా సంఘ సభ్యులు, పెయింటర్స్, ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షునిగా పితాని సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా జోశ్యుల మల్లికార్జునరావు, కార్యదర్శిగా పొన్నా రంగారావు, సహాయ కార్యదర్శిగా గండికోట వీరాస్వామి, పడమట దుర్గారావు ఎన్నికవగా కనకదుర్గ అమ్మవారి సన్నిధిలో సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా సభ్యుల పేరిట ఆలయ అర్చకులు బ్రహ్మజోశ్యుల సుబ్రహ్మణ్యం, సత్యప్రసాద్‌లు పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు.

బస్వాని సస్పెన్షన్‌పై పార్టీ పునరాలోచన చేయాలి

మొగల్తూరు, ఆగస్టు 5: మొగల్తూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బస్వాని ఏడుకొండలును సస్పెండ్ చేసిన విషయంపై జిల్లా తెలుగుదేశం కమిటీ పునరాలోచన చేయాలని మొగల్తూరు మండలానికి చెందిన సాగునీటి సంఘాల మాజీ అధ్యక్షుడు కోరారు. సోమవారం మొగల్తూరులో విలేకరుల సమావేశంలో మొగల్తూరు సంఘ మాజీ అధ్యక్షుడు కుమ్మరపురుగు తాతాజీ, కొప్పర్రు సంఘ మాజీ అద్యక్షుడు కత్తుల సత్యనారాయణ, ఆకన కోటి, కూనపరెడ్డి గోవిందరాజు, వినుకొండ కాశీ, అందే సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ బస్వాని టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతూ పలు పదవులు చేశారన్నారు. ఏడుకొండలు ప్రస్తుత ఇన్‌చార్జ్ విషయంలో ఇచ్చిన పత్రిక ప్రకటనలకు సంబంధించి పార్టీ సస్పెండ్ చేయడం దారుణమన్నారు.

ఇవేం..ఎండలు

తలపోటు..అలసటతో ప్రజలు ఇబ్బందులు





ఆచంట, పాలకొల్లులలో నిర్మానుష్యంగా రోడ్లు

పాలకొల్లు అర్బన్/ ఆచంట ఆగస్టు 5 : ఆషాఢ మాసంలో ఎండలు మండుతాయి. శ్రావణ మాసంలో వాతావరణం చల్లగా ఉండి వర్షాలు పడుతుంటాయి. ఆషాఢ మాసంలో వానలు ముంచెత్తాయి. శ్రావణమాసం ప్రారంభంలోనే చుర్రుమని కాస్తున్న ఎండలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రెండు రోజులుగా ఎండలకు తోడు వేడిగాలులు, ఉక్కబోతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ ఎండల్లో తిరగడం వల్ల తలపోటు, దాహం, అలసట వస్తోందని దీంతో సీజనల్ వ్యాధులు వస్తాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా ఎండలు మండుతున్నాయి. సోమవారం భానుడు తన ప్రతాపాన్ని చూపించాడు. ఉదయం 10 గంటల నుంచి వేడి గాలులు వీయ డంతో ప్రధాన రహదారులు అన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఇటువంటి ఎండలు ఎన్నడూ చూడలేదని పెద్దలు చెబుతున్నారు.



ఎమ్మెల్యే బొలిశెట్టికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గూడెం తహసీల్దార్.. పెనుమంట్ర తహసీల్దార్ రవికుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్లు

పెంటపాడు/మొగల్తూరు/అత్తిలి/పెనుమంట్ర/ఆకివీడు, ఆగస్టు 5: తహసీల్దార్లుగా నియమితులైన పలువురు తమ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. పెంటపాడు తహసీల్దార్‌గా ఏడిద శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. నర్సాపురం ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేసిన ఈయన బదిలీపై పెంటపాడు వచ్చారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. మొగల్తూరు తహసీల్దార్‌గా విద్యాపతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సమయంలో కాకినాడకు బదిలీ అయిన ఆయనను మొగల్తూరు తహసీల్దార్‌గా బదిలీ చేశారు. అత్తిలి తహసీల్దార్‌గా దశిక వంశీ బాధ్యతలు చేపట్టారు. ఆయన ఏలూరు జిల్లా కలిదిండి నుంచి బదిలీపై వచ్చారు. పెనుమంట్ర తహసీల్దార్‌గా రవికుమార్ బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికలకు కృష్ణాజిల్లా బంటుమిల్లి బదిలీపై వెళ్లి ఎన్నికల అనంతరం తిరిగి జిల్లాకు వచ్చారు ఆకివీడు తహసీల్దార్‌గా నందూరి వెంకటేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. మచిలీపట్నం నుంచి ఆకివీడు వచ్చారు. .

ఆచంటకు తహసీల్దార్ ఎవరు?

ఆచంట, ఆగస్టు 5 : సార్వత్రిక ఎన్నికల్లో బాగంగా ఆచంట నియోజకవర్గానికి సంబంధించి ఆచంట , పోడూరు, పెనుమంట్ర, పెనుగొండ మండలాలకు సంబంధించి బదిలీపై తహసీల్దార్‌లు వచ్చారు. వారం రోజుల క్రితం నాలుగు మండలాల తహసీల్దార్‌లు వారి వారి జిల్లాలకు బదిలీపై వెళ్లారు. రెండు రోజులు క్రితం కొత్త తహసీల్దార్‌లను నియమించగా ఆచంటకు తప్ప మిగతా మూడు మండలాలు నియమించారు. ఆచంటకు తహసీల్దార్ ఎవరు వస్తారనే దానిపై చర్చించుకుంటున్నారు.

భీమవరం వన్‌టౌన్ సీఐగా నాగరాజు



భీమవరం క్రైం, ఆగస్టు 5 : భీమవరం వన్‌టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2007 బ్యాచ్‌కి చెందిన నాగరాజు ఎస్ఐగా రాజోలు, తొండంగి, మండపేట టౌన్, ఇంద్రపాలెంలలో పనిచేశారు. 2023లో తొలుత సీఐగా తణుకులో పనిచేసి భీమవరం బదిలీపై వచ్చారు.

రేపు ములపర్రులో ఉచిత మెగా వైద్య శిబిరం

పెనుగొండ, ఆగస్టు 5 : బీవీ రమణ చారిటబుల్ ట్రస్టు, శ్రీకృష్ణ సాయి సేవా సమితి (ములపర్రు) ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఈనెల 7వ తేదీన ములపర్రు కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వైద్యులు జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, గైనకాలజీ (స్త్రీల వ్యాధులు), విష్ణు దంత వైద్య కళాశాల వారిచే దంత పరీక్షలు, పాలకొల్లు రాజవల్లి రాధారమణ్ లయన్స్ కంటి ఆసుపత్రి వారిచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

పాలకొల్లులో సీజ్ చేసిన వాహనాల వేలం

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 5 :ఎస్ఈబి (సెబ్) స్టేషన్ వద్ద ఈనెల 7వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటలకు సీజ్ చేసిన కారు, బైక్ బహిరంగ వేలం వేస్తున్నట్టు పాలకొల్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ భవాని ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 94409 02437 నంబర్‌లో సంప్రదించవచ్చునని తెలిపారు.

నేటి నుంచి కేవీకేలో పెరటికోళ్ల పంపకంపై శిక్షణ

ఉండి ఆగస్టు 5: ఉండి కృషివిజ్ఞాన కేంద్రంలో పెరటికోళ్ళ పెంపకంపై ఈనెల 6వ తేదీ మంగళవారం నుంచి 9వ తేదీవరకు శిక్షణ ఏర్పాటు చేసినట్లు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జునరావు తెలిపారు. కుటీర పరిశ్రమగా పెరటికోళ్ల పెంపకంపై శిక్షణ ఇస్తారని ఆసక్తిగల వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిపుణులైన పశువైద్య, విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలు,పశుసంవర్ధక శాఖ అధికారులు సూచనలు ఇస్తారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

వీరవాసరం, (భీమవరం టౌన్) ఆగస్టు 5: : వీరవాసరం మండలం కొణితివాడ సబ్‌స్టేషన్ పరిధిలో బే- ఎక్స్‌టెన్షన్ పనులు జరుగుతన్నందన మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఇండ్రస్ట్రియల్ ఫీడర్ విద్యుత్ సరఫరా నిలుపులదల చేస్తున్నట్లు ఏఈ బళ్ల సురేష్ కుమార్‌తెలిపారు. పంజా వేమవరం, పొలమూరు, నవుడూరు గ్రామాల ఇండ్రస్ట్రియల్ కన్స్యూమర్స్ ఆక్వా వినియోగదారులు సహకరించాలని కోరారు.

గోదావరిలో పంటు రాకపోకలు పునరుద్ధరణ

నరసాపురం రూరల్,ఆగస్టు 5: పది రోజులుగా వరదల కారణంగా నిలిచిపోయిన పంట రాకపోకల్ని సోమవారం మండల అధికారులు పునరుద్ధరించారు. దీంతో మాధవాయిపాలెం-సఖినేటిపల్లి రేవుల మధ్య పంటు, పడవల రాకపోకలు సాగాయి. ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు మాత్రమే గోదావరిలో రాకపోకల్ని అనుమతించనున్నారు.

సంక్షిప్తంగా..

నరసాపురం రూరల్ : మండలంలోని తూర్పుతాళ్లు మంచినీటి చెరువును త్వరలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే నాయకర్ హామీ ఇచ్చారు. సోమవారం తాగునీటి చెరువును పరిశీలించారు. ఫిల్టర్‌బెడ్‌లు ఏర్పాటు చేసి శుద్ధమైన నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఆచంట : జనసేన పార్టీ సభ్యత్వ నమోదు ఆచంట నియోజకవర్గంలో జోరుగా సాగింది.ఆనేక మంది సభ్యత్వం తీసుకునేందుకు ముందుకువచ్చారు. ఆచంటకు చెందిన జనసేన పార్టీ నాయకుడు మండేల శ్రీనివాస్ 50 మందికి రూ.25 వేలు అందించి సభ్యత్వాలు కట్టించారు.

భీమవరం అర్బన్ : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగానికి విరుద్ధమని దీనిపై మరో పోరాటానికి మాలలు సిద్ధంగా ఉన్నారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటపల్లి మంగరాజు అన్నరు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గంటా సుందర్ కుమార్, పాలపర్తి జోనా, పట్టెం శుభాకర్, కరుణాకర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆచంట : పంటనష్టం అంచనా ప్రక్రియ వేగవంతం చేసి తుది జాబితా రైతు సేవా కేంద్రాల్లో ప్రచురణ చేయాలని వ్యవసాయాధికారి బి.నాగరాజు అన్నారు. ఈ నెల 9వ తేదీ వరకు అభ్యంతరాలు ఉన్నట్లైతే రైతులు ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

పెనుగొండ : పెనుగొండ ఎస్‌వీకేపీ కళాశాల పాలకవర్గ అధ్యక్షుడిగా ఆంధ్రా యూనివర్శిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా సేవలందించిన పితాని సూర్యనారాయణ మృతి విచారకరమని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆకివీడు : సమాజంలో మంచిని ప్రోత్సహించి మంచి సమాజాన్ని నిర్మించడం కోసం విద్యార్థులు అన్యాయాన్ని ఎదిరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్‌రావు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ప్లీనరీ సమావేశం నిర్వహించి మాట్లాడారు.విద్యార్థులు తమ కళాశాలల్లో, పాఠశాలల్లో ఉన్న సమస్యలపై పోరాటం చేయాలన్నారు.

ఆచంట : గోదావరి ఉధృతి సోమవారం నాటికి మరింత తగ్గింది. మండలంలో ఉన్న పుష్కరరేవులు గోదావరి తగ్గడంతో బయటపడుతున్నాయి. రేవులన్నీ మట్టితో కప్పబడి ఉన్నాయి. వరద తగ్గడంతో గోదావరిలో పడవల రాకపోకలు సాగుతున్నాయి. లంక గ్రామాల్లో కొన్ని రోజులుగా శానిటేషన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.



రైతులకు విత్తనాలు అందిస్తున్న ఎమ్మెల్యే నాయకర్, పాత్తూరి రామరాజు

రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు

నరసాపురం రూరల్, పాలకొల్లు రూరల్, ఉండి ఆగస్టు 5: భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం వరి విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేస్తోందని కూటమి నాయకులు అన్నారు. సోమవారం మండలంలోని చిట్టవరం, కొత్త నవరసపురం, కొప్పర్రు, మల్లవరం, సరిపల్లి గ్రామాల్లో రైతులకు 80 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేశారు. నష్టపోయిన రైతుల్ని ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే నాయకర్ అన్నారు. ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు మాట్లాడుతూ త్వరలో రైతులకు సబ్సిడీపై పరికరాలు, స్ప్రేయర్లతో పాటు రాయితీలు అందిస్తుందన్నారు. ఏడీఈ అనిల్ కుమారి, ఏవో జాన్సన్, సర్పంచ్‌లు లక్ష్మణరావు, సంది సుజాత పాల్గొన్నారు. పాలకొల్లు మండలంలోని ఆగర్రు, ఆగర్రి పాలెం, వెలివెల గ్రామాల్లో సోమవారం రైతులకు సబ్సిడీ విత్తనాలను అందించారు.పంట దెబ్బతిన్న రైతులకు 80 శాతం రాయితీపై ప్రభుత్వం విత్తనాలను అందించినట్లు ఉండి మండలం వ్యవసాయాధికారి సంధ్య తెలిపారు. ఉప్పులూరు రైతుసేవా కేంద్రంలో రైతులకు 1153 వరి రకం విత్తనాలను అందించారు.



ఆకివీడులో సామూహిక సీమంతాలు చేస్తున్న ఐసీడీఎస్ పీవో వాణి విజయరత్నం, సూపర్‌వైజర్లు

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

ఆకివీడు/ మొగల్తూరు/ ఇరగవరం/ భీమవరం రూరల్/ పెనుగొండ/ తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 5 : పుట్టిన ప్రతీ బిడ్డకు మొదటి ఆహారం తల్లిపాలు ఇవ్వాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిని వాణి విజయరత్నం అన్నారు. సోమవారం ఆకివీడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి, గర్భిణులు, బాలింతలను సత్కరించారు. తల్లిపాలు ప్రాముఖ్యత తెలియచేసి ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ఆకివీడు, ఉండి, కాళ్ళ, పాల కోడేరు సూపర్‌వైజర్లు, సిబ్బంది, అంగన్‌వాడీలు ఉన్నారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు అందిస్తే బిడ్డకు మంచి ఆరోగ్యం కలుగుతుందని సీడీపీవో బి.ఊర్మిళ సూచించారు. ముత్యాలపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సీతారామరావు, ఎంపీహెచ్‌వో శ్రీనివాస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి, ఆయాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తల్లిపాలు తాగిన పిల్లలకు రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని ఇరగవరం సెక్టార్ సూపర్‌వైజర్ మాణిక్యాంబ తెలిపారు. పెద్దిరెడ్డి పాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గర్భిణులు, బాలింతలకు అవ గాహన కార్యక్రమం నిర్వహించారు. భీమవరం ఐసీడీఎస్ ప్రాజక్టు కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో ప్రాజక్టు ఆఫీసర్ లక్ష్మి మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను తెలుసుకోవాలన్నారు. శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. తల్లిపాలు అమృతం వంటివని ప్రతీ తల్లి బిడ్డకు రెండు సంవత్సరాలు వరకు తల్లిపాలు ఇవ్వొచ్చని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో కృష్ణకుమారి అన్నారు. పెనుగొండ ఎస్సీ కమ్యూనిటీ హాలులో తల్లిపాలపై అవగాహన నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయకుమారి, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. తల్లిపాలు బిడ్డకు సంజీవిని అని యూపీహెచ్‌సీ వైద్యులు శ్రావ్య పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని ఎన్టీఆర్ జంక్షన్, యాగర్లపల్లి యూపీహెచ్‌సీ వద్ద తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సిబ్బంది, వైద్యులు ర్యాలీ నిర్వహించారు.వైద్యులు తనూషా, నిహారిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విశాలాక్షి, భవాని తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేత



భీమవరం ఎడ్యుకేషన్, ఆగస్టు 5 : సత్కరో పీపుల్ ఫౌండేషన్ తరపున అమెరికాలో ఉంటున్న ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రీకరి పింగళి, నిహిత కొమ్మాలపాటి, ఇందిర పట్టణంలోని పలు పాఠశాలల్లో వివిధ కార్య క్రమాలు నిర్వహించారు. నాలుగు స్కూల్స్‌కు లక్ష 50 వేల రూపాయలు విలువ చేసే కంపాస్ బాక్సులు, అట్లాస్ బుక్స్, క్రీడా సామాగ్రి అందజేశారు.

వన మల్లిఖార్జునుడుకి జలాభిషేకం



మొగల్తూరు/పాలకొల్లు అర్బన్ ఆగస్టు 5: మొగల్తూరు వడయార్ పేటలో ఉన్న భ్రమరాంబికా సమేత వనమల్లిఖార్జునుడికి సోమవారం జలాభిషేకం నిర్వహించారు. ఉత్తర భారతదేశంలో నిర్వహించినట్టుగానే దక్షిణాదిలోని మన ప్రాంతంలోనూ నిర్వహించాలనే ఆలోచనతో ప్రప్రదమంగా సుమారు 40 కావిడిలతో జలాన్ని తీసుకువచ్చి స్వామివారికి అభిషేకం చేశారు. శ్రావణమాసంలో ఐదు సోమవారాలు స్వామివారికి కావిడి జలాభిషేకం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. శ్రీశైలం తరువాత స్వామివారి శివలింగాన్ని తాకే అవకాశం ఇక్కడే ఉండటంతో భక్తులు భారీగా తరలివచ్చి జలాభిషేకంలో పాల్గొన్నారు. పాలకొల్లు శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామివారికి సోమవారం ఏకవార, రుద్రాభి షేకాలు నిర్వహించారు.

ఆలమూరులో కొనసాగుతున్న ప్రథమ చికిత్స కేంద్రం

పెనుమంట్ర, ఆగస్టు 5 : పెనుమంట్ర, ఆగస్టు 5 : అలమూరు గ్రామం ఎస్.సి.కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్సా కేంద్రాన్ని ఇన్‌చార్జి జిల్లా మలేరియా ఆఫీసర్ రవికుమార్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆశా కార్యకర్తలు ఈ సీజన్ లో ప్రజలు ప్రతి రోజూ డ్రైడేగా పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి రోజూ ఫీల్డ్‌లో ఫీవర్ సర్వే చేసినమోదైన కేసుల వివరాలను సూపర్వైజర్లకు తెలపాలన్నారు. డెంగీ వ్యాధి వ్యాప్తి చేసే ఫిమేల్ టైగర్ దోమ పుట్టుకను లార్వా దశలోనే చెక్ పెట్టాలన్నారు.పంచాయతీ నిర్వహిస్తున్న యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్, ఆయిల్ బాలు వేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.



విద్యార్థినులతో కళాశాల కార్యదర్శి సత్య ఉషారాణి

యోగా పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

తణుకు, ఆగస్టు 5: ఆదివారం జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపవరంలో జరిగిన యోగా పోటీల్లో తమ విద్యా సంస్థల విద్యార్థులు పలువురు బహుమతులు గెలుచుకున్నారని ఎస్కేఎస్డీ కళాశాల కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి సోమవారం తెలిపారు. 8-10 ఏళ్ల బాలికల విభాగంలో టి.సాయి మోక్షిత ప్రథమ, భవిష్య తృతీయ స్థానం, బాలుర విభాగంలో పి.సూర్య ప్రథమ, బి.భార్గవి విష్ణువర్ధన్ తృతీయ, 10-12 ఏళ్ల బాలికల విభాగంలో జి.రవళి ద్వితీయ, 12-14 ఏళ్ల బాలుర విభాగంలో కుమార్ తృతీయ, 18-21 ఏళ్ల బాలికల విభాగంలో వి.శ్రావణి ద్వితీయ, బి.భవాని ప్రసన్న తృతీయ, జె.కృతిక, ఏ.సౌమ్య నాగవల్లి నాల్గో స్థానం, 21-15 ఏళ్ల బాలికల విభాగంలో బి.నాగలక్ష్మి దుర్గ ద్వితీయ, ఎం.విద్యాసాయి నాల్గో స్థానం సాధించారన్నారు. వీరిని జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, వివేకానంద గ్లోబల్ స్కూలు కరస్పాండెంట్ రీనా సాయి, పిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ, అధ్యాపకులు జి.అన్నపూర్ణ అభినందించారు.

కూచిపూడి నృత్యకారిణి జ్యోతిర్మయికి అవార్డు



తణుకు, ఆగస్టు 5: తణుకు పట్టణానికి చెందిన కూచిపూడి నృత్యకారిణి రావిళ్ళ జ్యోతిర్మయి ఆదివారం జరిగిన పోటీల్లో అవార్డు అందుకున్నారు.ఈమె తణుకు ప్రైవేటు స్కూల్లో 9వ తరగతి చదువుతోంది. ఏలూరులో అభినయ నృత్య భారతి 9వ జాతీయ స్థాయి నర్తనబాల అవార్డుల మహోత్సవం సందర్భంగా జరిగిన పోటీల్లో జ్యోతిర్మయి నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. ఆమెకు సర్టిఫికెట్, అవార్డుతో సత్కరించినట్లు తల్లిదండ్రులు రావిళ్ళ కృష్ణ, దుర్గాంబిక తెలిపారు.

ఉత్తమ గేయ రచయితగా డాక్టర్ బాలచందర్



పెనుగొండ, ఆగస్టు 5 : ప్రముఖ సాహిత్య సంస్థ తెలుగు వెలుగు సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన బాల సాహిత్యం దేశ భక్తి గేయ కవితల పోటీల్లో పెనుగొండ జూనియర్ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ బాల చందర్ సాదే రచించిన గేయానికి ఉత్తమ అవార్డు లభించింది. గౌరవ అధ్యక్షుడు పొట్లూరి హరికృష్ణ, అధ్యక్షురాలు కల్పనా దేవసాని నిర్వాహకురాలు వరలక్ష్మి అభినందిస్తూ ప్రశంసాపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.



వీసీ మురళీకృష్ణను సన్మానిస్తున్న స్వర్ణాంధ్ర పాలకవర్గ సభ్యులు

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

జేఎన్‌టీయూ వీసీ మురళీకృష్ణ

నరసాపురం రూరల్, ఆగస్టు 5: ఉన్నత చదువులకు లక్ష్యం ముఖ్యమని దీన్ని సాధించాలంటే కొన్ని త్యాగాలు తప్పవని జేఎన్‌టీయూ వీసీ మురళీకృష్ణ అన్నారు. నరసాపురం స్వర్ణాంధ్ర కాలేజీలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కొంతమంది విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై మంచి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు చదువు, జ్ఞానం, విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు తోటి విద్యార్థులతో షేర్ చేసుకుంటూ ఉండాలని అప్పుడే కొత్త ఆలోచనలు, అంశాలను సులభంగా అర్థం చేసుకోగలరన్నారు. అనంతరం ఆయనను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. చైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి త్రినాథ్, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, కీర్తి, బాబు, ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థులు, ఎస్ఈబీ అధికారులు

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 5 : మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు... జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ జి.నూకరాజు (భీమవరం) అన్నారు. పాలకొల్లు ఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్ఈబి, రసాయనశాస్త్రం విభాగం నిర్వహించిన అవగాహన సదస్సులో నూకరాజు మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ రాజేశ్వరి అధ్యక్షత వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మంచి అలవాట్లను పెంచుకోవాలని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.పాలకొల్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ జెవి భవానీ, కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం డాక్టర్ రామకృష్ణ డాక్టర్ లక్ష్మీ, రసాయన శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ యామిని, జగపతిబాబు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలకు సిద్ధం : ఎంఈవో

ఆకివీడురూరల్ ఆగస్టు 5 : స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు సిద్ధమైనట్టు ఎంఈవో రవీంద్ర అన్నారు. ఆకివీడు మండలంలో 39 ఎంపీపీ పాఠశాలలు, 9 హైస్కూల్స్ 3 యూపీ స్కూల్స్ కలిపి మొత్తం 51 పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. సోమవారం తల్లిదండ్రులు ఫైనల్ జాబితా ప్రచురించి నోటీసు బోర్డులలో పెట్టారని తెలిపారు. ఎస్సీబీసీ కేటగిరీలకు తొలి ప్రాధాన్యతగా, తరగతికి ముగ్గురు, ఇద్దరు మహిళలు, ఒక పురుషుడు ఎన్నుకుంటారని తెలిపారు. 15 సభ్యులను ఎన్నుకోగా, ఆరుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు, ఇద్దరు కోఆప్టెడ్ నియామకం జరుగుతుందని తెలిపారు.

విజయవంతంగా విద్యాప్రవేశ కార్యక్రమం



చెరుకుమిల్లి హెచ్ఎం ప్రవీణను సన్మానిస్తున్న ఏఎంవో, సీఎంవోలు

ఆకివీడురూరల్ ఆగస్టు 5 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి విద్యాప్రవేశ్ 90 రోజులు కార్యక్రమం విజయవంతంగా జరుగుతున్నదని సమగ్ర శిక్ష ఏఎంవో రామకోటేశ్వరరావు అన్నారు. 1వ తరగతిలో జాయిన్ అయిన విద్యార్థులకు విద్యపై ఆసక్తి పెంచేందుకు చిన్న పరికరాలు, ఆట, పాటలు, టీఎల్ఎమ్ ద్వారా విద్యాబోధన చేస్తారని తెలిపారు. ఆకివీడు మండలం చెరుకుమిల్లి గ్రామంలో ఎంపీపీ పాఠశాల హెచ్ఎం ప్రవీణను సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని బాగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి సన్మానిస్తున్నట్లు తెలిపారు.

స్వాతంత్ర్య సమర వీరులకు నివాళులు



భీమవరం టౌన్, ఆగస్టు 5 : స్వాతంత్ర్య ఉద్యమంలో ఎందరో త్యాగాలు చేశారని భీమవరం నుంచి ఎందరో సమర యోధులుగా నిలిచారని డీఎన్నార్ కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగ రాజు అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా విద్యా సంస్థల వ్యవస్థాపకులు దంతులూరి నారాయణ రాజు, చింతలపాటి మూర్తి రాజు, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు ఆయా కళాశాలలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.